# చింత చచ్చినా....

అది నాలుగు మండువాల భవంతి. దానివయస్సు రెండువందలసంవత్సరాలు. రెండు పక్కల పెణక కిందికి దిగిపోయింది. ఒక్కొక్కగదే వాస యోగ్యం కాకుండా పోతుంటే, పంతులుగారూ భార్యా తమ ఆవాసాన్ని బాగున్న గదుల్లోకి మార్చుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు తూర్పుభాగంలో రెండు మండువాలూ మారిపోయాయి, పశ్చిమార్థంలో పంతులుగారి నివాసం.

ఆ ఇంట్లో వస్తువులన్నీ సుమారు ఇంటివయస్సు గలవే. ఒకపంతులు గారూ, భార్యా తప్ప మండువాలన్నీ వర్షాకాలంలో జలమయమయిపోతాయి. నీరవతలికిపోయే తూములు పూడిపోవడం వల్ల. అంచేత ఆ ఇంట్లో కర్ర సామానులు అసలు వయస్సుకంటే ముపిలివిగా కనిపిస్తాయి.

పంతులుగారి తండ్రిదీ పెద్ద జమీ. తన చిన్న తనంలో ఆ ఇంటిశోభ చూపిన గుర్తుంది ఆయనకు, అంటే. వివరాలన్నీ గుర్తుంచుకోగల వయస్సు ఆయన కొచ్చేసరికి. జమీ పోవడం తండ్రి మరణించడం. మిగిలిన ఒక్క మామిడితోటమీదా వచ్చే ఆదాయంతో తను బతకడమేకాక, అంత పెద్ద ఇంటి బాగోగులు చేయించడం వంటి మార్పులన్నీ అకస్మాత్తుగా వచ్చిపడ్డాయి. అంచేత చిన్ననాటి స్మృతులు-అంటే ఆ యిల్లు మూడుపువ్వులూ ఆరు కాయలుగా ఉన్న రోజుల స్మృతులు-ఎప్పుడో కలలో కనిపించిన దృశ్యాల్లాగా ఆయనకు జ్ఞాపకం ఉన్నాయి.

భార్య రోగిష్టి. ఆయనే వండి. తను తినవలసినస్థితి. ఆయనకు కాలక్షేపమల్లా సోమసుందరంగారితో. వెనకటికబుర్లుచెప్పుకుంటూ కూచోడు. సోమనాథంపంతులుగారికంటే పదేళ్ళు పెద్ద-అంచేత ఆ ఇంటి సిరిసంపదలు పంతులుగారికంటె, స్పష్టంగా చూశారాయన. ఆయనకు పంతులుగారంటే నిజమైన అనురాగం-ఆ ఇంట పుట్టినందుకు భక్తికూడా.

పంతులుగారంటే ఆ ఊళ్ళో అందరికి భక్తే. స్థితిగతులు ఎలాంటివైనా ఆయన ఔదార్యం అందరూ గుర్తించిన వారే. నడివయస్సులో ఆయన ఆ ఊరికి మకుటంలేని రాజు. నూటికి తొంభై వంతులు తగాదాలన్నీ ఆయన ముందు పరిష్కారమై పోయేవి.

పంతులుగారి మనసు ఎంతమంచిదో, నోరు అంతచెడ్డది. అది ఆ ఊళ్ళో అందరికి తెలిసిన విషయమే గనుక ఎవరూ అట్టే పట్టించుకోరు. ఎవరన్నా కాని పనిచేస్తే వాళ్ళఇంటికి వెళ్ళి, ఏమయ్యా నువ్విలాంటి పని ఎందుకు చేశావు అని కర్ర విరిచినట్లు అనేసేవాడు. ఆయనమీద భక్తివల్ల ఆ ఆసామీ ఏమీ అనలేక పోయేవాడు. అంచేత కాని పనులు చెయ్యడానికే జడిసేవారు ఆ ఊరిజనం.

అయితే క్రమంగా రోజులు మారాయి। ఆయనకు తెలీకండానే ఆయన పలుకుబడి తగ్గిపోయింది, ఆ సంగతి చూచాయగా ఆయనకు తెలిసినా, అది గుర్తించడానికి ఆయన మనస్సు ఒప్పుకోలేదు. కారణం. యీ తరం కుర్రవాళ్ళెవరూ ఆయన పుట్టు పూర్వోత్తరాలు ఎరగరు. పైగా పైనుంచి వచ్చిన కుటుంబాలు కొన్ని. ఆ ఊరికి కొత్తగా వచ్చిన కుటుంబాలు కొన్ని. ఆ ఊరికి కొత్తగావచ్చిన పంచదార ఫ్యాక్టరీకి సంబంధించినవి. అసలీ ఊరి సంగతిగాని ఆ నాలుగు మండువాల భవంతి విషయంగాని వాళ్ళు ఎరగరు. అంచేత వాళ్ళకి ఆయనమీద గౌరవం ఉండడానికి అవకాశాలు తక్కువ. ఆయన

క్రమంగా ఊరి వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోవడం మానేశాడు. అంచేత ఆయనమాట కాదనిపించుకునే పరిస్థితి రాలేదు. ఆయన తప్పించు కున్నాడనండి కాని ఆయనలో ఒకమూల యీ ఊరికింకా మకుటంలేని రాజుననే భ్రమ చచ్చిపోలేదు.

ఆయనకు పెద్ద సమస్య ఆయన కొడుకు రంగయ్య. రంగయ్య ఇప్పుడెక్కడో ఉత్తరాదిని ఉద్యోగంలో ఉన్నాడు. రంగయ్య తన తాతగారి సంగతి వినడమేగాని చూసినవాడుగాడు. అతను పుట్టినప్పటినుంచీ దారిద్ర్యం తప్ప మరొకటి ఎరగడు. అంచేత తనతండ్రీ. సోమనాధంగారూ కలిపి వెనకటి కబుర్లు ఏకరువుపెడుతూంటే అవన్నీ వట్టికట్టుకధలనుకునేవాడతను. వీలైనప్పుడల్లా సోమనాధంగారిని వేళాకోళం చేస్తుండేవాడు. తండ్రిని ఏమన డానికీ సాహసం చాలక.

ఒకసారి రంగయ్య చిన్నతనంలో ఒకసంగతి జరిగింది. తోడిపిల్ల లతో కలిసి అతను చెడుగుడు ఆడుతుండగా. ఒక సంపన్న గృహస్థు కొడుకు కూతకొస్తే. అతన్ని కిందపడేసి. గుండెలమీదెక్కి కూర్చున్నాడు. ఆసంపన్న గృహస్థు, సరదాగా ఆట చూస్తున్నవాడు పట్టరాని కోపమొచ్చి. రంగయ్యని ఏడుతరాలు అటూ ఇటూ తిట్టరాని తిట్లు తిట్టాడు. రంగయ్య అన్నింటికీ ఒక చిరునవ్వు సమాధానంగా పారేశాడు.

ఈ సంగతి పంతులుగారికి తెలిసింది. ఆయన ఇంట్లోఉన్న పాత తుపాకీ తీశాడు. భార్య అడ్డుపడబోతే ఆమెను పక్కకీడ్చేసి గుమ్మంలో కొచ్చాడు. అక్కడ కూర్చున్నాడు. ఇంతవరకూ ఆతిట్టిన సంపన్న గృహస్థు మీద తుపాకి పేలుస్తాడనుకున్న భార్య అతనక్కడ కూర్చోడం చూసి బెదిరిపోయింది.

ఇంటికి రానీ. దవడపీనుగుని. పెద్దల్ని తిడుతుంటే ఏంచెయ్యకుండా ఇంటికి తిరిగొస్తాడా. ఒక్క గుండుదెబ్బతో యీ అవమానాన్ని తుడిచి

పెట్టేస్తాను .... అని అరిచాడు. భార్య కెవ్వున కేకేసి మూర్ఛపోయింది. సోమనాధంగారూ, ఇరుగు పొరుగువాళ్ళూ వచ్చి వారించడానికి ప్రయత్నించారు, కాని లాభం లేకపోయింది.

అయితే రంగయ్య మాత్రం ఇంటికి తిరిగిరాలే. ఈ సంగతి అతనికెలాగో తెలిసింది గాబోలు. చీకటిపడ్డ తరవాత పంతులుగారికోపం అదుర్దాగా మారింది. "ఇంకా రాలేదేం యీ పీనుగ...." అన్నాడు సోమనాధంగారితో.

"పోనీలెండి. రాకపోతేనేం. ఎక్కడో ఆత్మహత్య చేసుకుని ఉంటాడు. చెరువులున్నాయి. రైలుంది ...." అన్నాడు కొంటెగా సోమనాధం.

"చాల్లేవయ్యా. ఏమిటీ అపశకునం మాటలు ?" అన్నాడు పంతులుగారు. "ఏమీలే-ఇంటికొస్తే మీరెలాగా కాల్చేస్తారు. అంచేత ఏ చావైతేనేం?"

ఆ తరవాత సోమనాధం, పంతులుగారూ కలిపి ఊరంతా గాలించారు. రంగయ్య జాడలేదు. ఆనాడు అంతర్ధానమైన రంగయ్య అయిదు సంవత్సరాల తరవాత మిలిటరీ దుస్తుల్లో ప్రత్యక్షమయ్యాడు.

అప్పుడు సోమనాధంగారన్నారు...."ఆవేళ మీరు భయపెట్టిందొకమిషగాని. ఏదో సాకుచూసుకుని అబ్బాయి వెళ్ళిపోయేవాడే" ... అని.

రంగయ్య తనతండ్రి తన్ను చంపడానికి తీసిన తుపాకీ తెరిచి చూశాడు. పకపక విరగబడి నవ్వాడు. ఆ తుపాకి తుప్పుపట్టి పోయింది. లోపల గొట్టంఅంతా పూడిపోయింది. అది పంతులుగారి తండ్రిగారు ఉపయోగించేవాడు వెనకటిరోజుల్లో. "అయినా ఇది పాతకాలపుతుపాకి ..."అన్నాడు రంగయ్య.

"ఏడిశావు. దీంతో మీ తాతగారు రెండు పెద్దపులుల్ని చంపారు...." అన్నాడు పంతులుగారు.

"అయిందొమ్చు అయితే ఇప్పుడిది పిల్లిని కూడా చంపలేదు. మా పిస్టలు చూశారా. దానికంటె ఎంత చిన్నదో. ఇది పేల్చానంటే ఇంక తిరుగులేదు...." అన్నాడు రంగయ్య.

పంతులుగారు పాత తుపాకిని ఆప్యాయంగా నిమిరాడు. దాంట్లో తాత తండ్రుల ప్రభావం ఒక్కసారి ఆయన రక్తనాళాల్లోకి పాకినట్లు అని పించింది. కాని అది చల్లని గడ్డకట్టుకుపోయిన ప్రభావం అది పేలదు. కొడుకుచేతిలో చిన్నపిస్తోలు చేత్తో పట్టుకుచూశాడు. అది ప్రాణంలో బరు వెక్కి పోయినట్టుంది. ఛః పాతకొత్తల అంతరం అకస్మాత్తుగా ఆయనకు పెద్దదెబ్బలాగ మనస్సులో తగిలింది. వెనకటిరోజుల ప్రభావం జీవచ్ఛవం లాంటిది. బరువేగాని కదలిక లేనిది. ఈకాలపు కొత్తశక్తి చిన్నదైనా చర్రున మెదులుతుంది వింతగా. రెంటికి ఆ ఆయుధాలు రెండూ చిహ్నాలుగా అనిపించాయి ఆ క్షణంలో పంతులుగారికి.

---

రంగయ్య తల్లిని బుజ్జగించాడు. తండ్రితో తన భావిని గురించి చర్చించాడు. ఈ పాతఇంట్లో మిగిలినగది ఒకటే. ఇంక కొద్దిరోజుల్లో కూలి పోతుంది. అంచేత తనతో ఇద్దరినీ ఆగ్రా తీసుకుపోవడానికి నిశ్చయించానని చెప్పాడు. ఈ ఇల్లు ఏదోఖరీదుకి అమ్మేసి వెళ్ళిపోదామన్నాడు. వద్దని చెప్ప డానికి కూడా మనసు రాలేదు పంతులుగారికి.

అర్ధరాత్రివేళ పిస్తోలుమోత రంగయ్యని లేపింది పరుగెత్తి వెళ్ళాడు. పడమటి వరండాలో పంతులుగారి శరీరం రక్తపు మడుగులో పడిఉంది. ఆయనచేతిలో తన పిస్తోలుంది.

చూస్తూ అలాగే నిలబడి పోయాడు రంగయ్య.

(యువ, ఆగస్టు 1971 లో అచ్చు అయ్యింది. ఇది పాతకథఅని తోస్తుంది.)